డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ లాజిస్టిక్స్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకామ్, బీకామ్ ఆనర్స్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

తొలగించిన కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: విధుల నుంచి డిస్మిస్ చేసిన 10 మందితో పాటు సస్పెండ్ చేసిన 37 మంది కానిస్టేబుళ్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. టీడీఎస్ఎఫ్ విజయ్‌నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యలను వెల్లడించేందుకు పోలీసులు రోడ్లపైకి వచ్చారని చెప్పారు. వాళ్ల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి వారిపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకుని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఏడాదిలోగా రేవంత్ పదవి పోవడం ఖాయం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఏడాదిలోగా సీఎం రేవంత్‌రెడ్డి పదవి పోవడం ఖాయమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. దేశంలో తెలంగాణ అనే రాష్ట్రం ఉన్నంత వరకు కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ చెరిపేయలేరని చెప్పారు. చరిత్ర తెలియని చిట్టినాయుడికి చరిత్ర సృష్టించిన కేసీఆర్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్రంతో పోరాడి రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్ తెలంగాణలోని వీచే గాలిలో, పారేనీటిలో, రైతుల భూమిలో, మహిళల మనస్సుల్లో, యువత భవిష్యత్తులో, వృద్ధుల బోసి నవ్వుల్లో ఎప్పటికీ ఉండిపోతారని చెప్పారు. అటువంటి కేసీఆర్ గురించి ఏడాదిలో ఆ పదం లేకుండా చేస్తా అనడం రేవంత్ అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, సీఎం అయి, ముత్యమంత పనికూడా చేయని రేవంత్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతుంటే ప్రజలు నవ్వుతున్నారని అన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

ఓయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బషీర్‌బాగ్ పీజీ కళాశాల విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు విద్యార్థులు కోరారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి నాయకుడు ధర్మారపు శ్రీకాంత్ మాట్లాడుతూ ఓయూ పరిధిలోని అన్ని కళాశాలలు, కోర్సుల విద్యార్థులకు హాస్టల్, మెస్ వసతి కల్పించి, తమకు మాత్రం కల్పించకపోవడం బాధారమన్నారు. విద్యార్థులకు వర్సిటీలో మెస్, హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో అధునాతన డిజిటల్ లైబ్రెరీని ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని అర్హతలు ఉన్న రెగ్యులర్ ప్రొఫెసర్స్‌ను అధ్యాపకులుగా నియమించాలన్నారు. పీజీ లా కళాశాలకు వర్సిటీ నుంచి నిధులు కేటాయించాలన్నారు. డిమాండ్ ఉన్న బీబీఏ హానర్స్ కోర్సును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పవన్, ప్రదీప్, క్రాంతి, గణేశ్, శశి, అనాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ రిజిస్ట్రార్‌గా నరేశ్‌రెడ్డి, ఓఎస్డీగా జితేందర్‌నాయక్

రిజిస్ట్రార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్, చిత్రంలో ఓఎస్డీ ప్రొ. జితేందర్‌నాయక్, ప్రొ.లక్ష్మీనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి, ఓఎస్డీగా ప్రొఫెసర్ జితేందర్‌నాయక్ నియమితులయ్యారు. ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ నియామక పత్రాలను అందజేశారు. కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి ప్రస్తుతం టీజీ సెట్ మెంబర్ సెక్రెటరీ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన గతంలో టీఎస్ సెట్ కోఆర్డినేటర్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (హాస్టల్), వార్డెన్ బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం ఆయన స్వీకరించారు. ఆయన ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. జువాలజీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్ గతంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, జువాలజీ విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ స్థాయిల్లో సేవలందించారు. ఆయన ప్రస్తుత ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. వారిని వీసీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందించారు.



ఎమ్మెల్యే తలసానిని సన్మానించిన హమాలీబస్తీ నాయకులు

తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రతినిధుల బృందం

బస్తీ ప్రజలు ఐకమత్యంగా ఉండాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 30: పద్మారావునగర్ లోని హమాలిబస్తీ వాసులు బుధవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గత ఆదివారం హమాలిబస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాల నిర్వహణకు సహకరించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. బొడ్రాయి పండుగ సందర్భంగా హమాలిబస్తీలో పండుగ వాతావరణం నెలకొన్నదని, ఫేజ్-1, ఫేజ్-2 బస్తీలకు చెందిన వెయ్యి కుటుంబాలు ఐకమత్యంగా బోనాలతో పూజలకు హాజరు అయ్యారని వారు అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవత ప్రజలందరిని చల్లగా చూడాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. బస్తీ ప్రజలకు తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. బస్తీ ప్రజలు ఎప్పటికి ఇలా ఐకమత్యంగా ఉండాలని ఆయన కోరారు. బస్తీ అధ్యక్షుడు సుభాశ్, కుశాల్, అంజయ్య, సత్యనారాయణ, నర్సింహ, రవి, శివ, రమేశ్, నర్సింగ్‌రావు, గోవింద్, దుర్గ, అరుణ, భాగ్య పాల్గొన్నారు.

తలసానికి దీపావళి శుభాకాంక్షలు

సికింద్రాబాద్, అక్టోబర్ 30: దీపావళి సందర్భంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం సికింద్రాబాద్, మారేడుపల్లిలోని తలసాని నివాసంలో లక్ష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధుల బృందం గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, సాధం బాల్‌రాజ్‌యాదవ్, శైలందర్ కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి మరణించడంతో బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో కలిసి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు డీటీ నరేశ్, రామచందర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చిక్కడపల్లి, అక్టోబర్ 30: మారేడ్‌పల్లి, అక్టోబర్ 30: సెల్‌ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన జిన్న నరేశ్ (38) మిలటరీ క్యాంటిన్‌లో లేబర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 29న భూదేవినగర్-అమ్ముగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు లింగంపల్లి నుంచి ఘటుకేసర్ వైపు వెళ్తుండగా ఢీకొట్టడడంతో తల కువెనుక భాగంలో బలమైన గాయమైంది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతని వెంట ఉన్న స్నేహితుడు యాట వెంకటేశ్‌కు ఎడమ భుజానికి గాయమైంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

సీతారాంనగర్‌లో చెత్త వేసే ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 30: సీతాఫల్‌మండి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ హేమ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని సీతారాంనగర్‌లోని దేడ్ లాక్ బిల్డింగ్, బ్రాహ్మణ బస్తీలో శానిటేషన్ విభాగం పర్యటించారు. దేడ్ లాక్ బిల్డింగ్ వద్ద సెన్సార్ సీసీ కెమెరా, మైక్‌ను అమర్చారు. ఎవరైనా చెత్త వేస్తే మైక్ ద్వారా హెచ్చరిస్తుందని, కెమెరాల ద్వారా ఫొటో తీసి వారిని గుర్తించి ఫైన్ వేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో సీసీ కెమెరాకు దాదాపు రూ.10వేల ఖర్చు చేస్తునట్టు తెలిపారు. బ్రాహ్మణ బస్తీ ప్రాథమిక పాఠశాల వద్ద పేరుకపోయిన చెత్తను కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. వెంటనే తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈఈ వెంకటేశ్, రాంకీ సంస్థ డివిజన్ ఇన్‌చార్జి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

దేడ్ లాక్ బిల్డింగ్‌ను సందర్శించిన డీఈ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి దేడ్ లాక్ బిల్డింగ్ వద్ద స్థానికులు చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటితో పాటు మైక్‌లు ఏర్పాటు చేశారు. బుధవారం ఆ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ ఇంజినీర్ ఎస్‌డబ్ల్యూ వెంకటేశ్ సందర్శించి సీసీ కెమెరాలతో పాటు మైక్ ద్వారా జరుగుతున్న అనౌన్స్‌మెంట్‌లను పరిశీలించారు. డివిజన్‌లో ఖాళీ స్థలాల్లో స్థానికులు చెత్త వేస్తున్నారు. అధికారులు స్థానికులకు చెప్పినా వినకపోవడం, చెత్తను తరలించే ఆటోల్లోనే వేయాలని సూచించినా మారక పోవడంతో అధికారులు కెమెరాలను ఏర్పాటు చేశారు. యడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు మైక్‌లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దని ప్రచారం నిర్వహిస్తున్నారు. చెత్త వేసినచో వెయ్యి జరిమానా లేదా జైలు శిక్ష విధించనున్నట్టు అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రమేశ్ బానోత్‌తో పాటు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

అమీర్‌పేట్, అక్టోబర్ 30: దీపావళి పురస్కరించుకుని బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్ బుధవారం సనత్‌నగర్‌లోని తన కార్యాలయ ఆవరణలో జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బందికి చీరలు, పటాకులు, స్వీట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెట్ల తొలగింపు

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, అక్టోబర్ 30: డివిజన్ పరిధిలోని శ్మశాన వాటికల్లో జరుగున్న కల్పనకు కృషి చేస్తున్నామని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని శ్మశానవాటికల్లో చెట్ల తొలగింపు పనులను ఆమె బుధవారం పరిశీలించారు. శ్మశానవాటిక సమాధుల వద్ద పూజలను నిర్వహించుకునేందుకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చిక్కడపల్లి, అక్టోబర్ 30: ట్విన్ సిటీస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కందూరి కృష్ణ, మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు ఆధ్వర్యంలో బుధవారం వీఎస్‌టీ పార్క్‌లో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ ఉచిత శిబిరానికి మంచి స్పందన లభిచిందన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ సహకారం అందించారని తెలిపారు. భారతీయ యోగా సంస్థ యోగా గురువు రామోహన్‌రావు యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వి.నాగభూషణ్, సురేశ్, ఆదిత్య పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఎల్ఓసీ పత్రాల అందజేత

సికింద్రాబాద్, అక్టోబర్ 30: పేదల వైద్య సహాయానికి సిద్ధంగా ఉన్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పుష్పలత (సీతాఫల్‌మండి), రాజేశ్వరి (వారాసిగుడ), మహ్మద్ అన్సారి (బౌద్ధనగర్) అనారోగ్యం బారిన పడి వైద్య సహాయానికి సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించారు. వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు లక్షల విలువ చేసే ఎల్ఓసీ పత్రాలను బుధవారం సీతాఫల్‌మండిలోని తన కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు గరికపాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాణికేశ్వరీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాణికేశ్వరీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: మాణికేశ్వరీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జి.కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎ.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా బి.ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా జి.హరి, కోశాధికారిగా పి.శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా ఎస్.వెంకటేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి.అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా బి.చంద్రశేఖర్, జి.నర్సింహ, ఎ.ముత్యాలు, భార్గవిరాజ్, పి.రాజు, ఎ.విజయ్‌కుమార్ వ్యవహరించనున్నారు. అసోసియేషన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో బస్తీలోని సెవెన్ టెంపుల్స్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం మాణికేశ్వరీగనర్‌లో ప్రతీ వీధికి ఇంటి నంబర్లతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మాణికేశ్వరీనగర్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బోదాసు నర్సింహ, గండికోట శివ, నాగేందర్, కృష్ణ పాల్గొన్నారు.

రోగి సహాయకులకు జనహిత షెల్టర్ హోమ్ చేయూత



గాంధీ దవాఖానలోని షెల్టర్‌హోమ్‌ను సందర్శించిన అప్సా సిబ్బంది

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 30: దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం గాంధీ దవాఖానకు వచ్చే రోగి, సహాయకులకు జనహిత షెల్టర్ హోమ్ అందిస్తున్న చేయూత అభినందనీయమని అప్సా సంస్థ ప్రతినిధులు అన్నారు. బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్‌ను సందర్శించారు. ఏప్రిల్ 2024 నుంచి ఇక్కడ లభిస్తున్న ఉచిత సేవల గురించి మేనెజర్ నందకుమార్ వారికి వివరించారు. వేర్వేరు జిల్లాల నుంచి చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు, కుటుంబ సభ్యులకు ఉచితంగా వసతి, తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, దుప్పట్లు, చాప, దాతల సహకారంతో ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. బయటి రోగుల విభాగంలో హెల్ప్ డెస్క్ కూడా నిర్వహిస్తున్నామని నందకుమార్ తెలిపారు. అప్సా హైద్రాబాద్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎం.బస్వరాజ్, కోఆర్డినేటర్లు రమేశ్, మంజుల, శ్రీరాములు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంఎస్‌లో ఫ్రెషర్స్ డే

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్ర మహిళా సభ (ఏఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఫర్ వుమెన్‌లో ఘనంగా ఫ్రెషర్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించారు. ఆటపాటలతో హోరెత్తించారు. సీనియర్, జూనియర్లు కలిసి సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. మిస్ ఫ్రెషర్‌గా సానియా ఖాతూన్, మొదటి రన్నరప్‌గా హాకృతి, రెండో రన్నరప్‌గా హాసిని, మిస్ ఎక్స్‌ప్రెషన్‌గా మారవోని శిరీష నిలిచారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, కరస్పాండెంట్, సెక్రెటరీ పి.రజని, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఝాన్సీరాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కరుణా దేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.ప్రమీల, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలు పరిష్కరించండి

విద్యాకమిషన్ చైర్మన్, మెంబర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ప్రభుత్వ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ (టీజీఆప్టా) డిమాండ్ చేసింది. విద్యా శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, మెంబర్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం టీజీఆప్టా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎర్రం నాగేంద్రం మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో తాము జీవితాలు వెల్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏడాదిలో పన్నెండు నెలలు వేతనం చెల్లించాలని కోరారు. తమ సమస్యలను సావధానంగా విన్న కమిషన్ చైర్మన్ ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీజీఆప్టా గౌరవ అధ్యక్షుడు బి.రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఎం.కుమారస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు శ్రీలక్ష్మిరెడ్డి, ప్రతినిధులు, కిరణ్‌గౌడ్, మంచాల లింగస్వామి, మన్నె సుభాష్, కంచి రాజేశ్, రాగల్ల గంగాధర్, రాము, విఠల్, ఎ.కొండల్, శంకర్, భిక్షపతి, శ్రీనివాస్, ఎండీ ఖాన్, శ్రీవైష్ణవ వేణుగోపాల్, శరీన్, మహేశ్, నరేశ్, గట్టయ్య, పల్లవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలు ప్రైవేట్ పరం చేయరాదు

సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్

చిక్కడపల్లి, అక్టోబర్ 30: ప్రభుత్వ రంగం సంస్థలైన ఎల్ఐసీ, రైల్వే, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయారాదని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. పారదర్శక ఎన్నికల కోసం ఈవీఎం విధానం రద్దు చేయాలని అన్నారు. పార్టీ రెండో వార్షికోత్సవ సభ బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ సమానమైన విద్య, వైద్యం సేవలందించాలను అందించే బాధ్యత కలిగి ఉందని తెలిపారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు సమానమైన విద్య, వైద్యం అందించడంలో విఫలం చెందాయని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వల్ల అట్టడుగు వర్గాలకు అన్యాయం జరుగుతుందని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కమ్మెట భూపాల్, ఉపాధ్యక్షుడు అమీనోద్దీన్, నగేశ్ భూషణ్, సెంథిల్, అధికార ప్రతినిధి మధు భూంపల్లి, రాష్ట్ర కార్యదర్శులు బానోతు లింగన్న, కొక్కీస శ్రీలతగౌడ్, రావణ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
LOSS OF ORIGINAL DOCUMENT

General Public hereby call upon you that my client **SUBHASH KAMATAM REDDY,** S/o. Umapathi Kamatam Reddy, R/o. H.No. 6-3-1216/34, Green Lands, Begumpet, Secunderabad, Hyderabad, Telangana, have Lost his Original Agreement of Sale Dated 02-06-2020, executed by A.Mallesh Yadav, Son of Sathaiah and others in favour of my client, in respect of the Residential Apartment No. 3173 on 17th Floor in Tower No. 3, plinth area of 1840 Sft., saleable area which comprises of 1326 Sft. of carpet area, allotment of 2 Car Parking/s bearing No/s 2B-141, 2B-141A in Basement 2, UDS of 47 Sq.yds., Apartment known as "Sumadhura Horizon", situated at Kondapur (V), Serilingampally (M), Ranga Reddy. If anybody have trace out it or/found/kept with you while misplaced the Original Documents by my client please inform or send it to the above said address are below address:

Sd/- P.S.NAGESH, M. RAJITHA,
Advocates
H.No. 3-5-385, Flat No. G-1,
Omsree RK Enclave, Vittalwadi,
Narayanaguda, Hyderabad-29.
Cell: 9966374010, 9885317896.
Place: Hyderabad, Date: 30-10-2024.